సాక్షి
పశ్చిమగోదావరి
శుక్రవారం । 1 । మార్చి । 2024



అత్యుత్తమ ఫలితాలే లక్ష్యంగా..
పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించే దిశగా జిల్లా విద్యాశాఖ అధికారులు కృషి చేస్తున్నారు. 8లో ▸



ఉద్యోగాల కల్పనే ధ్యేయం
పేద విద్యార్థులందరికీ ఉన్నత విద్య, ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం చర్యలు తీసుకుందని మంత్రి కారుమూరి అన్నారు. 8లో ▸



అభివృద్ధి పరుగులు
అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సీఎం జగన్ ముందుకు వెళుతున్నారని నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. 8లో ▸

న్యూస్‌రీల్

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ గోపాల కృష్ణారావుకు జ్ఞాపిక అందిస్తున్న ఆలయ సూపరింటెండెంట్

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చిన వెంకన్న ఆలయాన్ని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాలకృష్ణారావు గురువారం సందర్శించారు. ముందుగా కుటుంబసమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు దేవస్థానం అధికారులు, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు ఆయనకు శ్రీవారి శేష వస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలకగా, ఆలయ సూపరింటెండెంట్ రమణరాజు చిన వెంకన్న జ్ఞాపిక, ప్రసాదాలను అందజేశారు.

మావుళ్లమ్మ సన్నిధిలో హైకోర్టు జడ్జి



హైకోర్టు జడ్జి ఆకుల శేషసాయికు అమ్మవారి చిత్రపటం అందిస్తున్న ధర్మకర్తలు

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం మావుళ్లమ్మవారిని హైకోర్టు జడ్జి ఆకుల శేషసాయి గురువారం దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. అర్చకులు ఆయనకు వేద ఆశీర్వచనం పలికారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ బుద్ద మహాలక్ష్మి నగేష్, చైర్మన్ మానేపల్లి నాగేశ్వరావు, ధర్మకర్తలు చెల్లంకి నాగ శేషగిరి, ముత్యాల రామారావు, తాళ్లపూడి భాగ్యలక్ష్మి, కొయ్య వెంకటలక్ష్మి అమ్మవారి చిత్రపటం, ప్రసాదం అందించారు.

నేటి నుంచి ఎంఎస్‌ఎంఈ సర్వే

భీమవరం (ప్రకాశంచౌక్): చిన్న, మధ్యతరహా పరిశ్రమల పనితీరు మెరుగుపరచడం, అభివృద్ధిని వేగవంతం చేయడం కోసం జిల్లాలో శుక్రవారం నుంచి ఈనెల 20 వరకు సర్వే చేయనున్నట్టు జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు. మంగపతిరావు గురువారం ప్రకటనలో తెలిపారు. ర్యాంప్ ద్వారా జిల్లాలోని అన్ని ఎంఎస్ఎంఈలను సర్వే చేస్తామని పేర్కొన్నారు. సర్వే ద్వారా అన్ని ఎంఎస్ఎంఈలను డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లోకి తీసుకువస్తామని తెలిపారు. సర్వే ప్రాతిపదికన ఎంఎస్ఎంఈలకు పథకాలపై అవగాహన, పారిశ్రామికవేత్తల నైపుణ్యాలను మెరుగుపర్చడం వంటివి చేపడతామని పేర్కొన్నారు. సర్వే బృందాలకు సహకరించాలని ఆయన కోరారు.

ఉపాధి శిక్షణ

ఉండి: లాజిస్టిక్ స్కిల్ కౌన్సిల్ (ఎల్ఎస్‌సీ) ద్వారా నిరుద్యోగులకు ఎన్నార్పీ అగ్రహారం ప్రభుత్వ ఐటీఐ ద్వారా స్వల్పకాలిక (వారం రోజుల) శిక్షణ ఇచ్చి వేర్‌హౌస్ అసోసియేట్ ఉద్యోగాలు కల్పిస్తున్నట్టు ఐటీఐ జిల్లా కన్వీనర్ వి.శ్రీనివాసరాజు గురువారం తెలిపారు. అభ్యర్థులు పదో తరగతి పాసై 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయసువారై ఉండాలన్నారు. అభ్యర్థులు ఈనెల 10లోపు ఐటీఐలో నేరుగా లేదా ఫోన్ 08816 297093, 9676099988 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నిట్ విద్యార్థికి పతకం



గుణవంతరెడ్డిని అభినందిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం: ఒడిసాలోని రూర్కెలాలో జరిగిన ఆలిండియా ఇంటర్ ఎన్ఐటీల ఈత పోటీల్లో ఏపీ నిట్ విద్యార్థి దుబ్బా గుణవంతరెడ్డి రెండు పతకాలు సాధించాడు. గురువారం ఏపీ నిట్‌లో జరిగిన కార్యక్రమంలో విద్యార్థిని అభినందించారు. బ్యాక్‌స్ట్రోక్ 100 మీటర్ల విభాగంలో రజతం, బ్యాక్ స్ట్రోక్ 50 మీటర్ల విభాగంలో కాంస్య పతకాలను గుణవంతరెడ్డి సాధించాడు. 2017 నుంచి గుణవంతరెడ్డి స్విమ్మింగ్‌లో రాణిస్తున్నాడు. 2018లో స్పోర్ట్స్, గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన పోటీల్లో రెండు రజత పతకాలతో సత్తాచాటాడు. గుణవంతరెడ్డిని రిజిస్ట్రార్ దినేష్ రెడ్డి, నిట్ అధికారులు వీరేష్‌కుమార్, కిరణ్ తీపర్తి, సందీప్, శ్రీనివాసు, సంధ్యారాణి, సాయిరామ్ అభినందించారు.

నేతన్నకు ఆదారమై

నాడు..

చేనేత కార్మిక కుటుంబాలను ఆదుకునేందుకు చీర–ధోవతి పథకాన్ని పునరుద్ధరిస్తాం. చేనేత ఉత్పత్తులపై 30 శాతం రిబేటు ఇస్తాం. చేనేత కార్మికులను అన్నివిధాలా ఆదుకుంటాం.. అంటూ 2014 ఎన్నికల ముందు హామీ ఇచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ఆ ఊసే ఎత్తలేదు. ప్రత్యామ్నాయ ఉపాధి చూసుకోవాలని చేనేత కార్మికులను చిన్నచూపు చూడటంతో పాటు చేనేత రంగాన్ని పూర్తిగా గాలికొదిలేసి నిర్వీర్యం చేశారు.

నేడు..

ప్రజా సంకల్ప యాత్రలో నేతన్నల అవస్థలను ప్రత్యక్షంగా చూసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కష్టాలు తీరుస్తానని హామీ ఇచ్చారు. సీఎంగా బాధ్యతలు చేపట్టిన ఆరు నెలల్లోనే చేనేతకు పూర్వ వైభవం తెచ్చేందుకు అడుగులు వేశారు. సమస్యల చిక్కుముళ్లతో సాగుతున్న నేతన్నల జీవితాలను సరిచేసేందుకు చర్యలు చేపట్టారు. 'వైఎస్సార్ నేతన్న నేస్తం' పథకం ద్వారా ఏటా రూ.24 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తూ వారి కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నారు.

రాట్నం రయ్ రయ్

- చేనేత కార్మికులకు అండగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- ఏటా రూ.24 వేల చొప్పున సాయం
- 'పశ్చిమ'లో 920 కుటుంబాలకు రూ.10.96 కోట్లు
- ఏలూరు జిల్లాలో 150 కుటుంబాలకు రూ.1.80 కోట్ల లబ్ధి
- నేతన్నలను విస్మరించిన గత టీడీపీ ప్రభుత్వం



నేతన్న నేస్తం.. మగ్గానికి జీవం.. మగ్గంపై చీరలు నేస్తున్న కార్మికుడు

సాక్షి, భీమవరం: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 6 వేల వరకు చేనేత కుటుంబాలు ఉన్నట్టు అంచనా. పాలకొల్లు, యలమంచిలి, పెంటపాడు, పోడూరు, పెంటపాడు మండలాల్లో చేనేత కార్మికులు అధికంగా ఉన్నారు. గత టీడీపీ ప్రభుత్వం చేనేత రంగాన్ని పట్టించుకోకపోవడంతో వేలాది మంది జీవనోపాధి కోసం ప్రత్యామ్నాయ మార్గాల వైపు వెళ్లిపోగా నమ్ముకున్న కులవృత్తిని వదిలిపెట్టలేక కొందరు ఇదే రంగంలో కొనసాగుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో చేనేత రంగాన్ని ఆదుకునేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పించారు.

నేతన్న నేస్తం : సొంత మగ్గం ఉన్న నేత కార్మికుల కుటుంబాలకు వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం నెలకు రూ.2 వేల చొప్పున ఏడాదికి రూ.24 వేల సాయం అందిస్తోంది. అక్రమాలకు తావులేకుండా ఏడాది మొత్తానికి సంబంధించి ఒకే రోజున లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు సాయం జమ చేస్తోంది. ఐదేళ్లలో ఉమ్మడి జిల్లాలో సగటున 1,063 కుటుంబాలకు రూ.12.76 కోట్ల లబ్ధి చేకూర్చింది. వీరిలో ప్రస్తుత పశ్చిమగోదావరి జిల్లాలో 920 కుటుంబాలకు రూ.10.96 కోట్లు, ఏలూరు జిల్లాలో 150 కుటుంబాలకు రూ.1.80 కోట్లు సాయం అందించింది. తండ్రి బాటలోనే తనయుడు సీఎం జగన్ చేనేత పరిశ్రమకు పూర్వ వైభవం తీసుకువస్తున్నారని నేత కార్మికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నేతన్న నేస్తం వివరాలు

పశ్చిమగోదావరి జిల్లా			ఏలూరు జిల్లా		
సంవత్సరం	లబ్ధిదారులు	సాయం (రూ.కోట్లలో)	సంవత్సరం	లబ్ధిదారులు	సాయం (రూ.కోట్లలో)
2019–20	854	2.01	2019–20	142	34.10
2020–21	1,067	2.57	2020–21	187	44.90
2021–22	779	1.87	2021–22	120	28.80
2022–23	839	2.02	2022–23	149	35.76
2023–24	1,027	2.47	2023–24	153	36.72

భరోసా కల్పించారు



వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం అద్భుతంగా ఉంది. చేనేత వృత్తికి భరోసా కల్పించేలా చరిత్రలో ఏనాడూ లేని ఆలోచన సీఎం జగన్ చేశారు. వృత్తినే నమ్ముకుని జీవనం సాగిస్తున్న వారికి ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటు ఎంతో ప్రోత్సాహకరంగా ఉంది. అన్నివిధాలా ఈ ప్రభుత్వం మా కుటుంబాన్ని ఆదుకుంది.
– నిల్లా నాగేంద్ర, దగ్గులూరు

వెలుగులు నింపారు



నాడు నేత కార్మికుల పెన్షన్ రెట్టింపు చేయడంతో పాటు వయసును 50 ఏళ్లకు వైఎస్సార్ తగ్గించారు. తండ్రికి తగ్గ తనయుడిగా సీఎం జగన్ మా నేత కార్మికుల కష్టాలు పట్టించుకుని అండగా నిలిచారు. కుల వృత్తిలో కొనసాగేందుకు సీఎం జగన్ ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటు సాయపడుతోంది.
– రావూరి వెంకటేష్, అత్తిలి

జగన్‌కు రుణపడి ఉంటాం



సీఎం జగన్ చేనేతలకు ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చిన వెంటనే అమలుచేశారు. మగ్గమున్న ప్రతి చేనేత కుటుంబానికి రూ.24 వేలు ఒక్కసారిగా అందించి ఆయా కుటుంబాల్లో ఆనందం వెల్లివిరిసేలా చేశారు. చేనేత కుటుంబాలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాయి.
– చింత సత్యనారాయణ, చింతపర్రు

జీవం పోశారు



నిర్వీర్యమైపోతున్న చేనేత పరిశ్రమకు వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం ద్వారా సీఎం జగన్ జీవం పోశారు. ముందుగానే పెట్టుబడి రావడంతో నేతన్నలు ధైర్యంగా వస్త్రాల తయారీకి ముందుకు వస్తున్నారు. ఈ పథకం మా కుటుంబాల్లో వెలుగులు నింపుతోంది. జగన్ మేలు మరువలేం.
– చిట్టింశెట్టి నర్సన్న, శివపురం

పేదలందరికీ ఇళ్లు ప్రభుత్వ లక్ష్యం



లబ్ధిదారులకు స్థలాల ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు

పోడూరు: పేదలందరికీ ఇళ్ల స్థలాలివ్వడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. తూర్పుపాలెం క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన పోడూరు గ్రామానికి చెందిన 14 మందికి, పండితవిల్లూరు గ్రామానికి చెందిన 10 మంది లబ్ధిదారులకు నివేశన స్థల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. పేదల అభ్యున్నతి, రాష్ట్రాభివృద్ధి కోసం సీఎం జగన్ అత్యంత పారదర్శక పాలన అందిస్తున్నారన్నారు. పథకాల ద్వారా లబ్ధిపొందిన ప్రజలంతా సీఎం జగన్‌కు అండగా నిలిచి మరోమారు ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. పోడూరు, పండితవిల్లూరు సర్పంచ్‌లు శెట్టిబత్తుల సువర్ణరాజు, ఇళ్ల లక్ష్మీచంద్రిక, సొసైటీ చైర్మన్లు రుద్రరాజు శివాజీరాజు, గెద్దాడ ఏకలవ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ గుబ్బల వీరబ్రహ్మం, మాజీ వైస్ చైర్మన్ చేకూరి సూరిబాబు, ఏపీ సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుమూడి రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

విష్ణు కళాశాలలో స్ట్రాంగ్ రూమ్‌లు

కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ



కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ

భీమవరం(ప్రకాశం చౌక్): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో భీమవరంలోని విష్ణు కాలేజీలో స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్టు కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు వీటిని ఏర్పాటుచేశామన్నారు.

అసెంబ్లీ నియోజకవర్గాలు

- **ఆచంట (56)**– విష్ణు కాలేజీ సీత పాలిటెక్నిక్ కాలేజ్ బిల్డింగ్‌లోని రెండో అంతస్తులో స్ట్రాంగ్ రూమ్. డ్రాయింగ్ హాల్–1,2లో కౌంటింగ్ సెంటర్.
- **పాలకొల్లు (57)**–విష్ణు స్కూల్ బిల్డింగ్ గ్రౌండ్ ఫ్లోర్‌లో స్ట్రాంగ్ రూమ్. అన్నపూర్ణ క్యాంటిన్ డైనింగ్ హాల్ 1,2లో కౌంటింగ్ సెంటర్.
- **నరసాపురం (58)**– విష్ణు స్కూల్ గ్రౌండ్ ఫ్లోర్‌లో స్ట్రాంగ్ రూమ్. సీత ఇండోర్ ఆడిటోరియం–1,2 విభాగాల్లో కౌంటింగ్ సెంటర్.
- **భీమవరం (59)**– విష్ణు కాలేజీ సీత పాలిటెక్నిక్ కాలేజ్ బిల్డింగ్ మొదటి అంతస్తులో స్ట్రాంగ్ రూమ్. ఆడిటోరియంలోని 3, 4 విభాగాల్లో కౌంటింగ్ కేంద్రం.
- **ఉండి (60)**– విష్ణు కాలేజీ సీత పాలిటెక్నిక్ కాలేజ్ బిల్డింగ్‌లోని రెండో అంతస్తులో స్ట్రాంగ్ రూమ్, ఉమెన్ ఇండోర్ బ్యాడ్మింటన్ కోర్టు, రెండు పార్ట్స్‌లో కౌంటింగ్ సెంటర్.
- **తణుకు (61)**– విష్ణు కాలేజీ స్కూల్ బిల్డింగ్‌లోని గ్రౌండ్ ఫ్లోర్‌లో స్ట్రాంగ్ రూమ్. విష్ణు ఫుడ్ ప్లాజా డైనింగ్ హాల్–1, 2లో కౌంటింగ్ సెంటర్.
- **తాడేపల్లిగూడెం (62)**– విష్ణు స్కూల్ బిల్డింగ్ గ్రౌండ్ ఫ్లోర్‌లో స్ట్రాంగ్ రూమ్. సెమినార్ హాల్‌లో కౌంటింగ్ సెంటర్.
- **నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గం (09):** పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు విష్ణు కాలేజీ ఫార్మసీ ఫస్ట్ ఫ్లోర్ క్లాస్ రూమ్‌లో స్ట్రాంగ్ రూమ్, ఫార్మసీ లైబ్రరీ హాల్ గ్రౌండ్ ఫ్లోర్‌లో కౌంటింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. వీటిలో అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక కౌంటింగ్ కేంద్రం, పార్లమెంట్ నియోజకవర్గానికి ఒక కౌంటింగ్ కేంద్రం వేర్వేరుగా ఏర్పాటుచేశారు.

క్లెయిమ్స్ ప్రక్రియ వేగవంతం

ప్రత్యేక ఓటరు సవరణ జాబితా కార్యక్రమం–2024 కింద చేపట్టిన కంటిన్యూయేషన్ అప్డేషన్‌లో భాగంగా ఫాం– 6, 7, 8 క్లెయిమ్స్, డిస్పోజల్ ప్రక్రియ వేగవంతం చేశామని కలెక్టర్ తెలిపారు. ఫాం–6,8కి సంబంధించి సమస్య లేదని, ఫాం–7కి సంబంధించి డెత్ కేసులు, డూప్లికేట్ కేసులను పరిశీలన చేసి పరిష్కరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎన్నికల సూపరింటెండెంట్ సీహెచ్ దుర్గాప్రసాద్, ఎన్నికల డీటీ ఎం.సన్యాసిరావు, రాజకీయ పక్షాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సెక్టార్ అధికారులు కీలకం

భీమవరం (ప్రకాశంచౌక్): ఎన్నికల నిర్వహణలో సెక్టార్ అధికారుల పాత్ర కీలకమని కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో భీమవరం, ఉండి నియోజకవర్గాల సెక్టార్ అధికారులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల నిర్వహణలో సెక్టార్ అధికారులు పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. పోలింగ్ కేంద్రాలను అధికారులతో కలిసి తనిఖీ చేయాలన్నారు. కేంద్రాల్లో మౌలిక వసతులను పరిశీలించి పటిష్ట ఏర్పాట్లు చేయాలన్నారు. దివ్యాంగులు, 80 ఏళ్లు దాటిన వారు ఓటింగ్‌కు రాలేకపోతే అధికారులే వాహనాలు ఏర్పాట్లు చేయాలన్నారు.

రూట్‌మ్యాప్‌లు సిద్ధం చేసుకోవాలి

సెక్టార్ అధికారులు పోలింగ్ స్టేషన్లకు సంబంధించి రూట్‌మ్యాప్‌లు తయారు చేసుకుని నివేదిక ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ రామసుందర్‌రెడ్డి ఆదేశించారు. ఎన్నికల రోజున అదే రూట్‌లో ఈవీఎంలు, పోలింగ్ సామగ్రిని తీసుకుని వాహనాలు వెళ్లాలని, వాహనాలకు జీపీఎస్ అమరుస్తారన్నారు. ఆర్డీఓ కె.శ్రీనివాసులు రాజు, జిల్లా ఎన్నికల శిక్షణ నోడల్ అధికారి కేసీహెచ్ అప్పారావు, ఎన్నికల సూపరింటెండెంట్ సీహెచ్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మాతృభాషపై మమకారం పెంచుకోవాలి



సదస్సులో మాట్లాడుతున్న సుధాకర్

పెనుగొండ: మాతృభాష తెలుగుపై ప్రతిఒక్కరూ మమకారం పెంచుకోవాలని, తెలుగు భాషను కాపాడుకోవాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ అన్నారు. పెనుగొండ ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్ రాజు కళాశాలలో తెలుగు విభాగం, ఆదికవి నన్నయ, ఆంధ్ర విశ్వవిద్యాలయం, తెలుగు సంపదల సౌజన్యంతో నిర్వహిస్తున్న అంతర్జాతీయ తెలుగు సదస్సు రెండో రోజు గురువారం కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు భాషను ప్రపంచ దేశాల్లో మరింత పరిచయం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇతర భాషల కంటే తెలుగు పరిధి ఎక్కువన్నారు. ఫ్రాన్స్ నుంచి యూట్యూబ్ అనుసంధానం ద్వారా డేనియర్ నేజర్స్ తెలుగులో మాట్లాడి ఆకట్టుకున్నారు. ఇతర రాష్ట్రాలు, దేశాల్లోని కేంద్రీయ విద్యాలయాల్లో తెలుగు ప్రవేశపెట్టాలని వక్తలు కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీవీ అప్పారావు, కవులు కొండేపూడి సర్వేశ్వర్‌ప్రసాద్, సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ కె.రామచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు

భీమవరం (ప్రకాశంచౌక్): ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా గురువారం జిల్లాలో డిగ్రీ విద్యార్థులకు బీసీ సంక్షేమశాఖ అధికారి గణపతి ఆధ్వర్యంలో రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా క్రాస్‌వర్డ్ పజిల్ పోటీలు నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన విద్యార్థులు 90 మంది 45 గ్రూపులుగా హాజరయ్యారు. మొదటి బహుమతి రూ.4 వేలు, రెండో బహుమతి రూ.3 వేలు, మూడో బహుమతి రూ.2 వేలు, కన్సొలేషన్ బహుమతులు రెండు గ్రూపులకు రూ.500 చొప్పున అందజేస్తామని గణపతి తెలిపారు. జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ నాగేంద్రప్రసాద్ పర్యవేక్షించారు.

టెట్‌కు 90 శాతం హాజరు

భీమవరం: జిల్లాలోని భీమవరం డీఎన్నార్ కళాశాలలో గురువారం నిర్వహించిన ఏపీ టెట్ పరీక్షలకు 90 శాతం మంది హాజరయ్యారని డీఈఓ ఆర్.వెంకటరమణ తెలిపారు. ఉదయం, మధ్యాహ్నం షిఫ్టుల్లో 284 మందికి 258 మంది హాజరయ్యారన్నారు. ఎలాంటి మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదుకాలేదని ఆయన తెలిపారు.

ఆలయ భూములకు రక్షణ

- 8,095 ఎకరాల ఆలయ భూముల్లో సర్వే
- ఆక్రమణల్లోని 301 ఎకరాల గుర్తింపు
- మూడు దశల్లో రీ సర్వే పూర్తి



పటిష్టంగా.. పారదర్శకంగా.. భూములను రీ సర్వే చేస్తున్న దృశం

భీమవరం(ప్రకాశం చౌక్): జగనన్న శాశ్వత భూహక్కు–భూహక్కు పథకంలో రీ సర్వేతో దేవుడు మాన్యాలకు మంచి రోజులు వచ్చాయి. ఏళ్ల తరబడి ఆక్రమణల్లో ఉన్న భూములు బయటపడుతున్నాయి. సీఎం జగన్ ప్రవేశపెట్టిన శాశ్వత భూహక్కు సర్వేలో నాటి రికార్డుల ప్రకారం వాస్తవ భూములను వెలికి తీసి దేవదాయ శాఖ రికార్డుల్లోకి ఎక్కించి ఆన్‌లైన్ చేసి భద్రపరుస్తున్నారు. దీనిలో భాగంగా పశ్చిమగోదావరి జిల్లాలో దేవదాయ శాఖకు చెందిన భూములను సర్వే చేస్తున్నారు. జిల్లాలో దేవదాయ శాఖకు సంబంధించి మొత్తం 8095.74 ఎకరాల భూములు ఉన్నాయి. ఈ మేరకు వివరాలను దేవదాయ శాఖ అధికారులు రెవెన్యూ అధికారులకు అందించారు. ప్రాపర్టీ రిజిస్టర్ సెక్షన్ల ఆధారంగా భూముల వివరాలతో పాటు పాత ఎఫ్ఎంబీ, ఆర్ఎస్ ఆర్డర్లను పరిశీలిస్తూ భూములను సర్వే చేసి రికార్డుల్లో ఎక్కిస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు మూడు దశల్లో రీ సర్వే పూర్తి చేయగా అందులో దేవదాయ శాఖకు చెందిన భూములను దాదాపు 60 శాతం మేర రీ సర్వే పూర్తయ్యింది.

ఆక్రమణ చెరలో..

జిల్లాలో అధికారుల లెక్కల ప్రకారం 301.81 ఎకరాల ఆలయ భూములు ఆక్రమణకు గురైనట్టు అధికారులు గుర్తించారు. దేవదాయశాఖ రికార్డుల ప్రకారం సర్వే చేసి ఆక్రమణలోని భూములను దశల వారీగా గుర్తిస్తున్నారు. వాటి సరిహద్దులు, భూమి, యాజమాన్యం వివరాలన్నింటినీ పక్కాగా నిర్ధారించి రికార్డుల్లో భద్రపరుస్తున్నారు. ఇలా ఇప్పటివరకు సుమారు 80 ఎకరాలపైగా భూములను ఆక్రమణల నుంచి విడిపించి దేవదాయ శాఖ రికార్డుల్లోకి ఎక్కించారు. భూములకు సంబంధించి సమస్య ఉంటే రీసర్వే ప్రత్యేక అధికారులుగా ఉన్న డిప్యూటీ తహసీల్దార్లకు దేవస్థానం అధికారులు ఫిర్యాదు చేసి సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో సుమారు 200 మంది అర్చకులకు అనువంశికంగా ఇచ్చిన భూములు 1,282.30 ఎకరాలు ఉన్నాయి. ఆలయ ద్వారా ఏడాదికి రూ.20.09 కోట్ల ఆదాయం వస్తోంది.

98 ఏళ్ల తర్వాత రీ సర్వే

98 ఏళ్ల క్రితం బ్రిటిష్ పాలకులు భూములను సర్వే చేసి గ్రామ కంఠం, వ్యవసాయం, ప్రభుత్వ భూములుగా విభజించి వాటిని అప్పటి రికార్డుల్లో ఎక్కించారు. అప్పటి నుంచి భూముల రీసర్వే జరగలేదు. ఏళ్ల తరబడి ఉన్న రికార్డులు పాడవడం, భూములకు సంబంధించి వివరాలు లభించడం కష్టం మారింది. దీంతో దేవదాయ శాఖకు చెందిన భూముల విస్తరణం రికార్డుల్లో ఉన్నప్పటికి వాస్తవంగా కనిపించడం లేదు. ఇలాంటి సమస్యలకు రీసర్వేతో మోక్షం కలుగుతోంది.

అన్ని చర్యలు తీసుకున్నాం



రీ సర్వే ద్వారా దేవస్థాన భూములకు రక్షణ కలుగుతుంది. ఆక్రమణకు గురైన భూములు సైతం తిరిగి దేవదాయ శాఖకు చెందేలా చర్యలు తీసుకున్నాం. ఈ సర్వేలో దేవదాయశాఖ భూములు సరిహద్దులతో సహా నూతనంగా ఆన్‌లైన్ ద్వారా రికార్డుల్లోకి ఎక్కిస్తున్నాం. భవిష్యత్‌లో ఆక్రమణలకు గురికాకుండా రికార్డుల్లో భద్రపరుస్తాం. రీ సర్వేలో దేవస్థాన భూమంతా సర్వే చేసేలా చర్యలు తీసుకున్నాం.
– ఈవీ సుబ్బారావు, జిల్లా దేవదాయ శాఖ అధికారి

క్లుప్తంగా

శ్రీవారి సన్నిధిలో ఆదిపరాశక్తి పీఠాధిపతి



నిత్య విద్యానంద భారతిస్వామికి స్వాగతం పలుకుతున్న అర్చకులు

ద్వారకాతిరుమల: చినవెంకన్న దివ్య క్షేత్రాన్ని ఆదిపరాశక్తి క్షేత్ర పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ నిత్య విద్యానంద భారతి స్వామి గురువారం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు ముందుగా అర్చకులు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి, ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు.

నాక్ బృందం సందర్శన

పెంటపాడు: డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలను గురువారం నాక్ బృందం సందర్శించింది. కేపీ హసిమ్ (కేరళ), సౌరభ్ కుమార్ దీక్షిత్ (మేఘాలయ), సతీష్‌కుమార్ గవాటి (బెల్గాం) విద్యార్థులు, ఉపాధ్యాయులతో విడివిడిగా సమావేశమయ్యారు. కళాశాల భవనాలు, తరగతి గదులు, మరుగుదొడ్లు, క్రీడాస్థలాలను పరిశీలించారు.

నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి మోసం

ఏలూరు టౌన్: ఏలూరు శనివారపుపేటలో ఖాళీ స్థలాన్ని అద్దెకు తీసుకుని గడువు పూర్తయిన అనంతరం నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి మోసానికి పాల్పడిన ఓ వ్యక్తిపై ఏలూరు త్రీటౌన్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. శనివారపుపేట రోడ్డు శాతవాహన నగర్‌లో లయన్స్ క్లబ్ ప్రాంతంలో నివాసం ఉంటున్న అట్లూరి నాగేశ్వరరావు కుమార్తె డి.రమాదేవి అమెరికాలో ఉంటున్నారు. ఆమెకు చెందిన ఖాళీ స్థలం శనివారపుపేటలో ఉండగా దీనిని 2019లో బాపులపాడు మండలం పెదగయకొయ్యేరుకు చెందిన గోగినేని నర్సింహరావుకు లీజుకు ఇచ్చారు. నెలవారీ అద్దె చెల్లించేలా ఇద్దరూ ఒప్పంద పత్రాలు రాసుకున్నారు. నర్సింహరావు ఖాళీ స్థలంలో పాల ఉత్పత్తుల వ్యాపారం చేస్తున్నారు. లీజ్ గడువు ముగియడంతో ఖాళీ చేయాలని నాగేశ్వరరావు పలుమార్లు చెప్పినా ఖాళీ చేయకుండా తాత్సారం చేస్తున్నారు. ఇటీవల ఆకస్మికంగా నకిలీ అగ్రిమెంట్ డాక్యుమెంట్లను సృష్టించడంతో ఖంగుతిన్న నాగేశ్వరరావు ఏలూరు త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సై కె.ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అత్యుత్తమ ఫలితాలే లక్ష్యంగా విజయకేతనం

- టెన్త్‌లో మెరుగైన ఫలితాల సాధన దిశగా అధికారుల కసరత్తు
- రూ.40 లక్షల జెడ్పీ నిధులతో స్టడీ మెటీరియల్ ముద్రణ
- ఉమ్మడి పశ్చిమలో 37,847 మంది విద్యార్థులకు పంపిణీ
- బీ, సీ కేటగిరీ విద్యార్థుల అభ్యసనలో స్పష్టమైన మార్పు



విజయకేతనం స్టడీ మెటీరియల్‌తో పదో తరగతి విద్యార్థులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): త్వరలో జరిగే పదో తరగతి పరీక్షల్లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించే దిశగా జిల్లా విద్యాశాఖ అధికారులు కృషి చేస్తున్నారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పదో తరగతి ఫలితాల్లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచి గుర్తింపు పొందింది. ఉమ్మడి రాష్ట్రంలో కొన్నేళ్ల పాటు 8, 9 స్థానాలకు పడిపోయిన జిల్లా అనంతరం విభజిత రాష్ట్రంలో సైతం అట్టడుగు స్థాయికి దిగజారి విద్యారంగంలో పూర్తిగా వెనుకబడిందనే చెప్పాలి. ఇలాంటి పరిస్థితిలో ఈ ఏడాది పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాలను రాష్ట్రంలో మెరుగైన స్థానాల్లో నిలబెట్టడానికి విద్యాశాఖ అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. దీనిలో భాగంగా విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు కూడా నిర్వహిస్తూ వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. ఈ మేరకు జిల్లా ఉమ్మడి పరీక్షల నిర్వహణ సంస్థ ఆధ్వర్యంలో విజయకేతనం పేరిట పదో తరగతి అన్ని సబ్జెక్టుల్లో మోడల్ పేపర్లను సిద్ధం చేయడమే కాక వాటికి జవాబులతో సహా విజయకేతనం పేరిట స్టడీ మెటీరియల్‌ను పుస్తకం రూపంలోకి తీసుకువచ్చారు.

నిపుణులైన సబ్జెక్టు ఉపాధ్యాయులతో కూర్పు

ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి విద్యార్థులందరూ అత్యుత్తమ ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో ఉమ్మడి పరీక్షల నిర్వహణ సంస్థ ఆధ్వర్యంలో ఈ ఏడాది రూపొందించిన విజయకేతనం పుస్తకాన్ని నిపుణులైన సబ్జెక్టు ఉపాధ్యాయుల సూచనలతో కూర్పు చేశారు. గతంలో రూపొందించిన స్టడీ మెటీరియల్‌లో దాదాపు 60 శాతం ప్రశ్నలు పరీక్షా పత్రాల్లో కనిపించేవి. కాగా ఆ ఏడాది రూపొందించిన స్టడీ మెటీరియల్‌లో కనీసం 80 శాతం ప్రశ్నలైనా ఉండేలా చేయాలనే దిశగా స్టడీ మెటీరియల్‌ను తీర్చిదిద్దారు. విద్యార్థులు పరీక్షల్లో ఎక్కువ స్కోరింగ్ చేయడానికి ఉపయోగపడేలా ఎనిమిది మార్కుల ప్రశ్నలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఆయా ప్రశ్నలకు జవాబులు చిన్నగా, విద్యార్థులకు సులభంగా గుర్తుండేలా రూపొందించారు. అంటే ఈ ప్రశ్నలను, జవాబులను చదివితే ఇటు 8 మార్కులతో పాటు అటు బిట్ పేపర్‌లో కూడా స్కోరింగ్ చేసే అవకాశం ఎక్కువగా ఉంది.

తెలుగు, ఇంగ్లిష్ మీడియంలలోనూ..

విజయకేతనం స్టడీ మెటీరియల్‌ను ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని 48 మండలాల్లోని అన్ని ప్రభుత్వ యాజమాన్య స్కూళ్లలో తెలుగు, ఇంగ్లిష్ మీడియం విద్యార్థులకు పంపిణీ చేశారు. తెలుగు మీడియం విద్యార్థులు 15,983, ఇంగ్లిష్ మీడియం విద్యార్థులు 21,860 కలిపి మొత్తం 37,847 మందికి పుస్తకాలను ఇప్పటికే అందజేసి వాటిని అభ్యసించేలా ఉపాధ్యాయులకు తగిన సూచనలు చేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ సైతం విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో జిల్లా పరిషత్ నుంచి రూ.40 లక్షల నిధులు విడుదల చేయడంలో చొరవ చూపి ప్రోత్సహించారు.

పది రోజులకో పరీక్ష



చదువులో వెనుకబడిన విద్యార్థుల ఉత్తీర్ణతే ప్రధాన లక్ష్యంగా ఈ ఏడాది స్టడీ మెటీరియల్‌ను రూపొందించాం. దీని ముద్రణకు సహకరించాలని జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీని కోరగా ఆమె వెంటనే అంగీకరించి జెడ్పీ నిధులు మంజూరు చేశారు. విద్యార్థులకు ఇప్పటికే పది రోజులకు ఒకటి చొప్పున రెండు సార్లు పరీక్షలు నిర్వహించాం.

– ఎ.సర్వేశ్వరరావు, కార్యదర్శి, జిల్లా ఉమ్మడి పరీక్షల నిర్వహణ సంస్థ

వెనుకబడిన విద్యార్థుల్లో పురోగతి



విజయకేతనం స్టడీ మెటీరియల్‌లో అన్ని సబ్జెక్టుల్లోని ప్రధానాంశాలను పొందుపరిచాలని సబ్జెక్టు నిపుణులకు సూచించాం. విద్యార్థి ప్రతి సబ్జెక్టులోనూ ప్రతి రోజూ ఒక పెద్ద ప్రశ్న, 2 చిన్న ప్రశ్నలు, 10 బిట్లు చదివించేలా చర్యలు తీసుకున్నాం. ఇటీవల నిర్వహించిన రెండు పరీక్షల్లో వెనుకబడిన విద్యార్థుల ఫలితాలు బాగున్నాయి.

– ఎస్.అబ్రహం, జిల్లా విద్యాశాఖాధికారి, ఏలూరు జిల్లా

ఉత్తీర్ణతకు దోహదం



విజయకేతనం స్టడీ మెటీరియల్‌లో పొందుపరిచిన ప్రశ్న, జవాబులను విద్యార్థులకు చదవడానికి మరింత తేలికగా ఉంది. గత ఐదేళ్లలో పదో తరగతి పరీక్షల్లో వచ్చిన ప్రశ్నలను క్రోడీకరించి ఈ పుస్తకాన్ని రూపొందించాం. ఈ మెటీరియల్‌ను చదివితే ప్రతి విద్యార్థి కచ్చితంగా ఉత్తీర్ణుడయ్యే అవకాశం ఉంది.

– ఆర్కే అన్నపూర్ణ, స్కూల్ అసిస్టెంట్, ఫిజికల్ సైన్స్

ఎంతో ఉపయోగకరం



విజయకేతనం స్టడీ మెటీరియల్ వెనుకబడిన విద్యార్థులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంది. ఈ పుస్తకాన్ని చదివితే బీ, సీ కేటగిరీ విద్యార్థులు తప్పకుండా ఉత్తీర్ణులయ్యే అవకాశం ఉంది. ఎంతో కసరత్తు చేసి ఈ మెటీరియల్‌ను రూపొందించాం. ఈ ఏడాది మా పాఠశాలలో ఉత్తీర్ణత శాతం పెరుగుతుందనే నమ్మకం ఏర్పడింది.

– పి.కుటుంబరావు, హెచ్ఎం, సుబ్బమ్మదేవి హైస్కూల్, ఏలూరు

ప్రైవేట్‌కు దీటుగా డిజిటల్ విద్యాబోధన

భీమవరం: ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విద్యను ప్రవేశపెట్టి అధునాతన బోధనా విధానాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద విద్యార్థులకు చేరువ చేశారని రాష్ట్ర విద్య, సంక్షేమ మౌలిక వసతుల సదుపాయాల కల్పన సంస్థ (ఏపీఈడబ్ల్యూఐడీసీ) చైర్మన్ యనమల నాగార్జున యాదవ్ అన్నారు. నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో జరిగిన అభివృద్ధిని పరిశీలించేందుకు గురువారం జిల్లా వ్యాప్తంగా పర్యటించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో 10 రకాల మౌలిక వసతులు తప్పకుండా ఉండాలనే ఉన్నతాశయంతో జిల్లాలోని 20 మండలాల్లోని 1,288 పాఠశాలల్లో రూ.387 కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు రూ.17 వేల కోట్లకు పైగా ఖర్చుచేసి ప్రభుత్వ పాఠశాలలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అభివృద్ధి చేసి ప్రైవేటు విద్యా సంస్థలకు దీటుగా డిజిటల్ విద్యను అందిస్తున్నారన్నారు. ప్రభుత్వం విద్యాభివృద్ధికి చేస్తున్న కృషిని విద్యారులంతా సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, విద్యాబోధనపై విద్యార్థులను ఆయన అడుగుగా గతంలో పాఠశాలల్లో సరైన మౌలిక వసతులు లేక అనేక ఇబ్బందులు పడ్డామని, గత ఐదేళ్లుగా పాఠశాలల రూపురేఖలు మారి అనేక సదుపాయాలు సమకూరాయని విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. నాగార్జున యాదవ్ జిల్లాలోని తణుకు, పెనుమంట్ర, పాలకొల్లు, పాలకోడేరు తదితర మండలాల్లో పర్యటించగా ఆయన వెంట ఏపీఈడబ్ల్యూఐడీసీ ఈఈ సదాశివరావు, డీఈ నాగేంద్రబాబు, ఏఈ ఆనంద్ రెడ్డి, సమగ్ర శిక్ష ఏఈ వెంకటేశ్వరరావు ఉన్నారు.



ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న నాగార్జున యాదవ్


ఉన్నత విద్య, ఉద్యోగాల కల్పనే ధ్యేయం

- మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు
- తణుకులో మెగా జాబ్‌మేళాలో 283 మందికి ఉద్యోగాలు



తణుకు జాబ్‌మేళాలో మంత్రి కారుమూరిని సత్కరిస్తున్న ఆర్‌జేడీ, ప్రిన్సిపాల్ తదితరులు

తణుకు టౌన్: రాష్ట్రంలోని పేద విద్యార్థులందరికీ ఉన్నత విద్య అందించాలనే లక్ష్యంతో ఏడెక్స్ సంస్థతో ఒప్పందం చేసుకున్నారని, దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. గురువారం తణుకులోని ఎస్కేఎస్ఐఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ సొసైటీ, జేకేసీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమంలో కళాశాల విద్య ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ సీహెచ్ కృష్ణ మాట్లాడుతూ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థి ఒక చేతిలో డిగ్రీ పట్టాతో పాటు మరో చేతిలో ఉద్యోగ నియామక పత్రాన్ని తీసుకువెళ్లాలనే ఉద్దేశంతో ప్రభుత్వం జాబ్ మేళాను నిర్వహిస్తోందన్నారు. కళాశాలలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ ద్వారా వివిధ వృత్తులలో శిక్షణ కూడా అందిస్తోందన్నారు. శిక్షణ అనంతరం పూర్తి స్థాయి నైపుణ్యంతో డిగ్రీ విద్యను పూర్తి చేయాలని చెప్పారు. తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.అనిల్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులను ఉన్నత విద్యలో అంతర్జాతీయ స్థాయిలో నైపుణ్యాలు కల్పించేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. తణుకు, తాడేపల్లిగూడెం ఎస్ఆర్‌సీ పరిధిలో ఉన్న అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ డిగ్రీ కళాశాలల్లో డిగ్రీ ఆఖరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఈ జాబ్ మేళాలో పాల్గొన్నారని చెప్పారు. ఈ జాబ్ మేళాలో అపోలో ఫార్మశీ, యాక్సిస్ బ్యాంక్, అంజనా ఫౌండేషన్, ముత్తూట్ ఫైనాన్స్ తదితర 20 కంపెనీలు పాల్గొన్నట్లు తెలిపారు. ఈ జాబ్ మేళాకు మొత్తం 923 మంది విద్యార్థులు హాజరు కాగా, వారిలో 283 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని చెప్పారు. మరో 300 మంది విద్యార్థులు షార్ట్ లిస్ట్‌లో ఉన్నారన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.అనిల్‌కుమార్ చేతుల మీదుగా ఆఫర్ లెటర్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల సీపీడీసీ కార్యదర్శి సత్తి వెంకట శ్రీనివాసరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ చిట్టూరి వెంకట సుబ్బారావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సూరంపూడి కామేష్, నిడదవోలు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రుద్ర, ప్రభుత్వ డిగ్రీ కళాశాల జేకేసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ టి.సంధ్యారాణి, కళాశాలల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆన్‌లైన్‌లో వ్యవసాయ కోర్సులు

ఉండి : ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఆన్‌లైన్ విద్యావిధానంలో సర్టిఫికెట్ కోర్సులు ప్రారంభిస్తున్నట్లు కృషీ విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎన్.మల్లికార్జున గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. యూనివర్సిటీలో వ్యవసాయ విద్యావ్యాప్తికి తీసుకునే చర్యల్లో భాగంగా ఈ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. దీనిలో భాగంగా రైతులు, యువత, మహిళలకు ఆన్‌లైన్ ద్వారా సర్టిఫికెట్ కోర్సులు తెలుగు మీడియంలో సేంద్రియ వ్యవసాయం, పుట్టగొడుగుల పెంపకంపై 8 వారాల శిక్షణ, ఒకరోజు ప్రాక్టికల్ ప్రోగ్రాం నిర్వహిస్తారన్నారు. ఈ తరగతులు మార్చి, ఏప్రిల్‌లో జరుగుతాయన్నారు. ఆసక్తి కలిగిన వారు రూ.1,500 ఫీజు చెల్లించాలని, అభ్యర్థికి కంప్యూటర్, అండ్రాయిడ్ ఫోన్, ఐపాడ్ వంటివి కలిగి ఉండాలన్నారు. మార్చి 20వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకుని 83096 26619 నంబర్‌లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 7 గంటలలోపు సంప్రదించాలని సూచించారు.

అగ్ని ప్రమాదంలో దుకాణం దగ్ధం



అగ్నిప్రమాదంలో షాపులో కాలి బూడిదైన సామగ్రి

తణుకు: తణుకు పరిధిలోని గురువారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఓ దుకాణంలో అగ్ని ప్రమాదం సంభవించి సుమారు రూ.3 లక్షల వరకు ఆస్తినష్టం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. వేల్పూరు రోడ్డులోని మసీదు సమీపంలో శ్రీరమ్య పాన్ అండ్ జనరల్ స్టోర్స్‌లో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు వ్యాపించకుండా అదుపు చేశారు. అప్పటికే దుకాణంలో సామగ్రి మొత్తం అగ్నికి ఆహుతి అయ్యింది. షాపు యజమాని చిలికోటి వెంకటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మినీ వ్యాన్‌ను ఢీకొని ముగ్గురికి గాయాలు

వీరవాసరం: వీరవాసరం – పెనుమంట్ర రహదారిలో తోకలపూడి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలుడి సహా ముగ్గురికి గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. నవుడూరుకు చెందిన ఎస్.దుర్గారావు, ఓ యువకుడు, బాలుడు ద్విచక్ర వాహనంపై గురువారం నవుడూరు నుంచి వీరవాసరం వైపు వెళుతుండగా, వీరవాసరం నుంచి నవుడూరు వైపు వస్తున్న మినీ వ్యాన్ వెనుక భాగాన్ని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో దుర్గారావు తలకు గాయం కాగా, ప్రశాంత్ అనే బాలుడి కాలికి తీవ్ర గాయమైంది. మరో యువకుడికి స్వల్ప గాయమైనట్లు స్థానికులు తెలిపారు. గాయపడిన వారిని 108 వాహనంలో భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని ఎస్సై పి.రమేష్ చెప్పారు.

కడుపునొప్పి తాళలేక వ్యక్తి ఆత్మహత్య

ముసునూరు: కడుపునొప్పి తాళలేక పురుగుమందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. వలసపల్లికి చెందిన మల్లినేని సురేష్ (38) తరచూ కడుపునొప్పితో బాధపడుతున్నాడు. బుధవారం కూడా నొప్పి తీవ్రంగా రావడంతో తట్టుకోలేక పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు హుటాహుటిన ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య శ్రావణి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి, మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు ఎస్సై పి.వాసు తెలిపారు.

డిపాజిట్ సొమ్ము మోసంపై కేసు

ఏలూరు టౌన్ : ఓ ప్రైవేటు సంస్థలో చేసిన డిపాజిట్లు తిరిగి ఇవ్వకపోవడంతో ఒక మహిళ పోలీసులను ఆశ్రయించింది. సత్రంపాడుకు చెందిన దేగా వాణీ 2011లో అభయా గోల్డ్ ఇన్ఫ్రాటెక్ ఇండియా లిమిటెడ్‌లో కొంత సొమ్మును డిపాజిట్ చేశారు. మెచ్యూరిటీ గడువు తీరినా సొమ్ము ఇవ్వలేదు. విజయవాడలోని ఏలూరు రోడ్డులో ఉన్న అభయ గోల్డ్ ఇన్ఫ్రాటెక్ ఇండియా లిమిటెడ్, సంస్థ ప్రతినిధులుగా ఉన్న కొయ్యలగూడెం మండలం కన్నాపురానికి చెందిన సుంకర దుర్గారావు, అతని భార్య సుంకర రమాదేవిలపై ఏలూరు త్రీటౌన్ పోలీసులు గురువారం చీటింగ్ కేసు నమోదు చేశారు.

జగన్ పాలనలో అభివృద్ధి పరుగులు

- ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు
- నూజివీడులో కలెక్టర్‌తో కలిసి ఏరియా ఆస్పత్రి నూతన భవనం ప్రారంభం



నూజివీడులోని ఏరియా ఆసుపత్రిలో నూతన భవన ప్రారంభోత్సవ శిలాఫలకం ఆవిష్కరించిన ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

నూజివీడు : అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళుతున్నారని, ప్రతిపక్షాలు దీనిని చూడలేక కళ్లు లేని కబోదిలా వ్యవహరిస్తున్నాయని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. నూజివీడు పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో రూ.25 కోట్లతో ఆధునిక వసతులతో నిర్మించిన నూతన భవనాన్ని గురువారం కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రతాప్ ప్రారంభించారు. కొత్త భవనంలోని వార్డులు, ఐసీయూ, ల్యాబ్ తదితర విభాగాలను స్థానిక ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే ప్రతాప్ మాట్లాడుతూ రాష్ట్రంలో పోర్టులు, మెడికల్ కళాశాలలు, గ్రామగ్రామాన సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, విలేజ్ క్లినిక్‌లకు నూతన భవనాలను నిర్మిస్తూ అభివృద్ధిని ప్రభుత్వం పరుగులు పెట్టిస్తోందన్నారు. ఏరియా ఆసుపత్రిలో ప్రస్తుతం 20 మంది వైద్యులు ప్రజలకు మెరుగైన వైద్యచికిత్సను అందిస్తున్నారన్నారు. కేంద్రీయ విద్యాలయంను మార్చిలో ప్రారంభిస్తున్నామని, దీనికి రాష్ట్ర ప్రభుత్వం ఏడెకరాల భూమిని కేటాయించిందన్నారు. త్వరలోనే క్రికెట్ స్టేడియం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామని, రూ.25 కోట్లతో మైలవరం రోడ్డు నుంచి విస్సన్నపేట రోడ్డు వరకు బైపాస్ రోడ్డు నిర్మిస్తున్నామని, త్వరలోనే పనులు ప్రారంభమవుతాయన్నారు. మధ్య తరగతి, ఉద్యోగులకు తక్కువ ధరకు ఇళ్ల స్థలాలను ఇచ్చేందుకు ప్రభుత్వం నూజివీడులోని మామిడి పరిశోధన స్థానం పక్కన 40 ఎకరాల్లో ఎంఐజీ లేఅవుట్‌ను ఏర్పాటు చేసిందన్నారు. అంతేకాక పీజీ కేంద్రంలో రూ.6 కోట్లతో అకడమిక్ భవనాన్ని నిర్మిస్తున్నామని, అది కూడా పూర్తి కావొచ్చిందన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు మళ్లీ సీఎం చేయడం ఖాయమన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా నూజివీడు మూడుసార్లు వచ్చి ట్రిపుల్ ఐటీలో మూడు మొక్కలు నాటి వెళ్లడం అభివృద్ధా అని ఎమ్మెల్యే నిలదీశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా నూజివీడులో పర్యటించి రూ.16 కోట్ల నిధులను మంజూరు చేశారన్నారు. చంద్రబాబు గ్రాఫిక్స్‌లకు ప్రాధాన్యతనిచ్చి రాష్ట్ర ప్రజలను మాయ చేయాలని చూస్తూ తగిన గుణపాఠం నేర్చారని, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అలా కాకుండా వాస్తవ అభివృద్ధికి పెద్దపీట వేశారన్నారు. వేరే ప్రాంతం నుంచి నూజివీడుకు కొందరు వచ్చి ఇక్కడ ఎగురుతున్నారని, వారికి నియోజకవర్గ సరిహద్దులు, ఇక్కడి ప్రాధాన్యతలు తెలియవన్నారు. ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గానికి వైఎస్సార్ సీపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయాలను స్థాపించి ప్రభుత్వ పాలనను ప్రజల వద్దకే తీసుకెళ్లారన్నారు. పేదలకు విద్య, వైద్యం అందించేందుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. జగన్ పాలనలో రాష్ట్రంలో పేదరికం తగ్గుముఖం పడుతోందని నీతి ఆయోగ్ చెప్పిందంటే పాలన ఎలా ఉందో అర్థమవుతోందన్నారు. కృష్ణా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక మాట్లాడుతూ పేదలకు నాణ్యమైన వైద్యం ఉచితంగా అందేలా సీఎం వైఎస్ జగన్ కృషి చేస్తున్నారన్నారు. వైద్యులు కూడా నాణ్యమైన చికిత్సను అందించాలన్నారు. ఏపీ స్టేట్ కో-ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ, ఆర్డీఓ వై.భవానిశంకరి, డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్ సతీష్‌కుమార్, అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ నాగేశ్వరరావు, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏవీఆర్ మోహన్, కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ గొర్రెల మాధవి, పెరిక కార్పొరేషన్ డైరెక్టర్ అత్తి పార్వతి, విద్యా మౌలిక సదుపాయల సంస్థ డైరెక్టర్ కలగర వెంకటేశ్వరరావు, సీనియర్ వైద్యులు ఆర్.నరేంద్ర సింగ్ పాల్గొన్నారు.

సాగులో సాంకేతికతతోనూ అధిక దిగుబడులు

ఏలూరు (మెట్రో) : ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని రైతులకు సేవలందిస్తున్న ఏరువాక కేంద్రం, ఏలూరులో జిల్లా స్థాయి సమన్వయ సంఘ సమావేశం గురువారం నిర్వహించారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, మార్టేరు వ్యవసాయ పరిశోధన స్థానం సహ సంచాలకులు డాక్టర్ డి.శ్రీనివాస్ జిల్లా స్థాయి సమన్వయ సంఘ సమావేశానికి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో శ్రీనివాస్ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో మారుతున్న కాలానికనుగుణంగా వస్తున్న శాస్త్ర, సాంకేతికతను అందిపుచ్చుకుని సాగు చేయడం ద్వారా రైతులు అధిక దిగుబడులను సాధించగలుగుతారని సూచించారు. స్థానిక ఏరువాక కేంద్రంలోని శాస్త్రవేత్తలు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని శాస్త్రీయంగా చేపట్టి పరిశోధన ఫలితాలను రైతుల ముంగిట చేర్చుతున్నారన్నారు. జిల్లాలో రైతులు ఈ పరిశోధనా ఫలితాలను అందిపుచ్చుకుని నాణ్యమైన అధిక దిగుబడుల ద్వారా అధికాదాయం పొందవచ్చన్నారు. ఏరువాక కేంద్రం, ఏలూరు కో-ఆర్డినేటర్ డాక్టర్ టి.సుజాత 2023–24 సంవత్సరంలో చేపట్టిన వ్యవసాయ విస్తరణ కార్యక్రమాల ప్రగతిని, పంటలు దిగుబడులు, పంటల స్థితిగతులు, చీడపీడలు, క్షేత్ర సందర్శనలు, నూతన వంగడాల ప్రదర్శన క్షేత్రాలు, సార్వా దాళ్వా సాగులో చేపట్టిన కార్యక్రమాల నివేదికను నివేదించారు. విస్తరణ సంచాలకుల నామినీ డాక్టర్ వి.విశాలక్ష్మి మాట్లాడుతూ అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంలో భాగంగా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు రైతులకు శిక్షణ ఇవ్వాలని సూచించారు. సమావేశానికి జిల్లా వ్యవసాయ అధికారి షేక్ బాషా ముఖ్య అతిథిగా హాజరై రైతులు అధిక దిగుబడులు సాధించాలంటే మేలైన సాగు పద్ధతులను పాటించడంతో పాటు సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో శాస్త్రవేత్తలు డాక్టర్ కె.ఫణికుమార్, ఎన్.నాగేంద్రబాబు, ఎస్.చాముండేశ్వరి, జిల్లా ఉద్యాన అధికారి ఎస్.రామమోహన్, అనిల్ కాంత్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కామాక్షమ్మ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



మాధవరం గ్రామంలో కామాక్షమ్మ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని మాధవరం గ్రామంలో కామాక్షమ్మ ఆలయ పునఃనిర్మాణానికి ఆలయ చైర్‌పర్సన్ సుభాషిణి – అరుమై రాజన్ దంపతులు గురువారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ యువనేత కొట్టు విశాల్ మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి రూ.75లక్షలు నిధులు మంజూరైనట్లు తెలిపారు. త్వరితగతిన ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేసి, భక్తులకు అందుబాటులోకి తెస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సూర్పని రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జడ్డు హరిబాబు, సీజీఎఫ్ కమిటి సభ్యుడు కర్రి భాస్కరరావు, నాయకులు తారమట్ల శ్రీనివాస్, ప్రత్తి రంగయ్య, కవులూరి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల్లో పక్కా ఏర్పాట్లు చేయాలి



ఆర్డీవో కే.చెన్నయ్య

తాడేపల్లిగూడెం రూరల్: పోలింగ్ బూత్‌ల్లో పక్కాగా అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆర్డీవో కే.చెన్నయ్య అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎన్నికల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో కే.చెన్నయ్య మాట్లాడుతూ ఎక్కడైనా సదుపాయాలు లేని పక్షంలో వాటిని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఎన్నికల అధికారులకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. అంతా సమన్వయంతో ఎన్నికలు ప్రశాంత నిర్వహణకు సహకరించాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ అనూరాధ, మున్సిపల్ ఇంజనీర్ మురళీ, ఈవోపీఆర్డీ ఎం.వెంకటేష్, ఏడీఏ పి.మురళీకృష్ణ, గృహింగ్ డీఈ కేవీవీఎస్.ప్రసాద్, ఎంఈవో–2 పీఎంకే.జ్యోతి, మండల పరిషత్ జూనియర్ అసిస్టెంట్ భరత్‌కుమార్, పోలీస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన సింగం త్రిమూర్తులు



జిల్లా కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌గాంధీని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మోనటరింగ్ సభ్యులు, తాడేపల్లిగూడెంనకు చెందిన సింగం త్రిమూర్తులు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం త్రిమూర్తులు జిల్లాలో ఉన్న ఎస్సీ, ఎస్టీ సమస్యల గురించి కలెక్టర్‌కు వివరించినట్లు తెలిపారు. ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు సింగం చెప్పారు.

ఉద్యోగుల, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఉద్యోగుల, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏపీటీఎఫ్ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు తాడేపల్లిగూడెం తాలూకా ఆఫీస్ సెంటర్‌లో ఏపీటీఎఫ్ జోనల్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఉద్యోగులు, ఉపాధ్యాయులు ధర్నా చేశారు. ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బీవీ నారాయణ మాట్లాడుతూ బకాయిలు చెల్లించాలని, నూతన పీఆర్‌సీలో 30 శాతం ఐఆర్ ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఝాన్సీ విజయకుమారి, జిల్లా కార్యదర్శి లంకా రాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి ఎం.నాగరాట్నాలు, ఆకుల పోతురాజు, ఎం.శ్రీలక్ష్మి, ఎం.పుష్పరాజ్, జై.వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీలలితా త్రిపుర సుందరి దేవికి విశేష పూజలు



అత్తిలిలో శ్రీలలితా త్రిపురసుందరీదేవిని దర్శించుకుంటున్న భక్తులు

అత్తిలి: స్థానిక ఆంజనేయస్వామివారి ఆలయ ప్రాంగణంలో నెలకొల్పిన శ్రీలలితా త్రిపుర సుందరీదేవి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ ప్రథమ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు చేబ్రోలు భీమేష్, రమేష్ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, విశేష పూజలు నిర్వహించారు. లలితా దేవి భక్త సమాజం వారిచే భక్తిగీతాలు ఆలాపన, దీపోత్సవాన్ని జరిపారు.

జగనన్న కాలనీల్లో విద్యుత్ కాంతులు

- రూ. 21.66 కోట్లతో జగనన్న కాలనీల్లో విద్యుత్ సౌకర్యాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు
- పైడిపర్రు జగనన్న కాలనీలో విద్యుత్ సబ్ స్టేషన్



తణుకు ఆర్డీవో కార్యాలయ ప్రాంతంలో జగనన్న కాలనీల్లో ముస్తాబైన ఇళ్లు

తణుకు అర్బన్: పేదోడి సొంతింటి కల సాకారం చేయాలనే ఉద్దేశ్యంతో అర్హులైన పేదలందరికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న కాలనీల పేరిట ఇంటి స్థలాన్ని మంజూరు చేసి ఇళ్ల నిర్మాణాలు సైతం చేయించారు. అటువంటి బృహత్తర కార్యక్రమంలో విద్యుత్ శాఖ ద్వారా కూడా ప్రభుత్వం జగనన్న కాలనీ లబ్ధిదారులకు అత్యున్నత విద్యుత్ వెలుగులను ఉచితంగానే సమకూర్చింది. ఇందులో భాగంగా కాలనీల్లో విద్యుత్ అవసరాలను పూర్తిగా అందుబాటులోకి తీసుకువచ్చి లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా విద్యుత్‌శాఖ అధికారులు సౌకర్యాలు కల్పించారు. ఇందులో భాగంగా జగనన్న కాలనీ లబ్ధిదారుల సౌకర్యార్థం విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్స్, విద్యుత్ తీగలు, మీటర్లతోపాటు పైడిపర్రులో ఒక విద్యుత్ సబ్‌స్టేషన్స్ నిర్మాణాన్ని ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యుత్ శాఖ తీర్చిదిద్దింది.

107 లేఅవుట్‌లలో రూ. 21.66 కోట్లు ఖర్చు..

తణుకు నియోజకవర్గంలోని తణుకు మున్సిపాల్టీ, తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాలకు సంబంధించి 107 లేఅవుట్‌లలోని జగనన్న కాలనీల్లో 13479 ఇళ్ల స్థలాలకుగాను రూ. 21.66 కోట్లుతో 3703 విద్యుత్ స్తంభాలు, 146 ట్రాన్స్‌ఫార్మర్స్‌తోపాటు 70 కిలోమీటర్ల మేర హెచ్‌టీ, ఎల్‌టీ విద్యుత్ తీగలు, 2102 వీధిదీపాలను జగనన్న కాలనీల్లో ఇప్పటివరకు ఏర్పాటు చేశారు.

ప్రతిష్టాత్మకంగా జగనన్న కాలనీలు



జగనన్న కాలనీల్లో విద్యుత్ వెలుగుల నిర్వహణను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఇప్పటివరకు తణుకు నియోజకవర్గంలో 21.66 కోట్లు ఖర్చుచేసింది. ప్రభుత్వ ఆదేశానుసారంగా లబ్ధిదారుకు ఉచితంగానే విద్యుత్ మీటర్లు, సర్వీసు వైరు, మీటరు బాక్సు తదితర సామాగ్రిని కూడా అందజేశాం. కాలనీలన్నీ విద్యుత్ వెలుగులతో నిండిపోయేలా వీధి దీపాలు ఏర్పాటు చేశాం. విద్యుత్‌శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు లబ్ధిదారులకు ఎటువంటి విద్యుత్ ఇబ్బందులు తలెత్తకుండా పూర్తిస్థాయి పర్యవేక్షణ చేస్తున్నాం.

– సీహెచ్ రామకృష్ణ, తణుకు విద్యుత్ శాఖ డీఈఈ

జగనన్న కాలనీలు ప్రత్యేక ఊర్లు మాదిరిగా



అత్తిలి మండలంలోని జగనన్న కాలనీల్లో రూ. 4.44 కోట్లుతో విద్యుత్ సరఫరా కోసం లబ్ధిదారులకు అవసరమైన అన్ని సౌకర్యాలు విద్యుత్ శాఖ ఏర్పాటు చేసింది. రాత్రివేళ్లలో సైతం పట్టపగలు మాదిరిగా విద్యుత్ దీపాలు వెలుగులు ఇస్తున్నాయి. జగనన్న కాలనీలన్నీ ప్రత్యేకమైన ఊర్ల మాదిరిగా రూపాంతరం చెందుతున్నాయి. లబ్ధిదారులకు ఏ సౌకర్యం అవసరమైనా మంత్రి కారుమూరి వెంటనే స్పందించి ఏర్పాటుచేయిస్తున్నారు.

– ఎండీ హబీబుద్దీన్, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులు, అత్తిలి

రూ. 3.30 కోట్లతో విద్యుత్ సబ్ స్టేషన్



తణుకు పైడిపర్రు జగనన్న కాలనీలో లబ్ధిదారులకు విద్యుత్ సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేకంగా విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఏర్పాటుచేశారు. దీంతో పైడిపర్రుతోపాటు చుట్టుపక్కల ఉన్న గ్రామాలకు విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గుల ఇబ్బందులు తొలగాయి. అంతేకాకుండా రూ. 6.53 కోట్లుతో పైడిపర్రు జగనన్న కాలనీలో విద్యుత్ సౌకర్యాలు కలుగచేశారు.

– జంగం ఆనంద్‌కుమార్, వైఎస్సార్‌సీపీ తణుకు మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు

పిల్లలను బాగా చదివించాలి



ముప్పిడి సంపత్‌కుమార్‌ను సత్కరిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): తల్లిదండ్రులు పిల్లలను బాగా చదివించాలని వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ ముప్పిడి సంపత్ కుమార్ అన్నారు. పట్టణంలో ఆదర్స్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ స్వచ్ఛంధ సేవా సంస్థలో గురువారం సబ్ డివిజనల్ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు రొక్కాల నాగబుజ్జి అధ్యక్షతన జరిగిన సమావేశంలో విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాలు జరిగాయి. అనంతరం సంపత్‌కుమార్‌కు ఆదర్స్ అవార్డును అందజేశారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ ఆర్.ఆశీర్వాదం, కోశాధికారి సుగుణ రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

పన్నులు చెల్లించండి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పురపాలక సంఘానికి చెల్లించాల్సిన ఆస్తి పన్నులు, నీటి కుళాయి పన్నులు, ఖాళీ స్థలాల పన్నులను వెంటనే చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని కమిషనర్ శామ్యూల్ పేర్కొన్నారు. సకాలంలో చెల్లించని వారి నీటి కుళాయి కనెక్షన్లు తొలగించటయే గాక చట్ట రీత్యా తదుపరిచర్యలు తీసుకుంటామని తెలిపారు.

మంత్రి కారుమూరి పరామర్శలు



అత్తిలి వాడపల్లి శింగరాచార్యులు కుటుంబాన్ని పరామర్శిస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

అత్తిలి: మండలంలో ఇటీవల మృతి చెందిన పలు కుటుంబాలను రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు గురువారం పరామర్శించారు. అత్తిలి మండలం బల్లిపాడు గ్రామంలో ఇటీవల మృతిచెందిన ఆచంట చిన సత్యం కుటుంబాన్ని మంత్రి పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. చినసత్యం కుమారుడు బాబ్జి, కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. అత్తిలిలో ఇటీవల మృతిచెందిన కంకటాల శ్రీలక్ష్మిదేవి చిత్రపటానికి మంత్రి కారుమూరి నాగేశ్వరరావు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఆమె మనువడు కంకటాల సతీష్‌ను పరామర్శించి, సంతాపం వ్యక్తం చేశారు. అత్తిలిలో శ్రీవేణు గోపాలస్వామి ఆలయ అర్చకులు వాడపల్లి శింగరాచార్యులు ఇటీవల ఆకస్మికంగా పరమపదించారు. శింగరాచార్యుల కుమారుడు వాడపల్లి శేఖరాచార్యులు, కుటుంబ సభ్యులను మంత్రి కారుమూరి నాగేశ్వరరావు పరామర్శించి, సంతాపం వ్యక్తం చేశారు. శింగరాచార్యులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. మాజీ సర్పంచ్ ఆకుల పండుస్వామి, ఉపసర్పంచ్‌లు తలారి శ్రీనివాస్, మద్దాల శ్రీనివాస్, ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ ధనుమూరి తాతాజీ, తదితరులు పాల్గొన్నారు.

పడాలలో పౌర హక్కుల దినోత్సవం



పడాల అంబేద్కర్ కమ్యూనిటీ హోల్ వద్ద పౌర హక్కుల దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పడాల అంబేద్కర్ కమ్యూనిటీ హాల్‌లో గురువారం సాయంత్రం పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవోపీఆర్డీ ఎం.వెంకటేష్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రతి పౌరునికి జీవించే హక్కు, వాక్ స్వాతంత్ర్యం వంటి హక్కులను కల్పించిందని, వారి హక్కులకు భంగం కలిగిస్తే చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. కులం పేరుతో దూషించరాదన్నారు. అలాగే బాల్య వివాహాలు చేయరాదని, వరకట్నం వంటివి నేరమన్నారు. పౌరుల ప్రాథమిక హక్కులను గుర్తెరిగి నడుచుకోవాలన్నారు. డీడీవో శ్రీనివాస్, వీఆర్వో రాము, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటి సభ్యుడు రొక్కాల నాగబుజ్జి, గ్రామ పెద్దలు ప్రసాద్, వినోద్, సాల్మన్‌రాజు, రాజబాబు, సొసైటీ కార్యదర్శి వేమన, సిబ్బంది పాల్గొన్నారు.

హనుమాన్ సినిమా ప్రేక్షకుల హృదయాలు కదిలించింది



హనుమాన్ సినిమా సంగీత దర్శకుడు గౌర హరిని సత్కరిస్తున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ఆదరణ పొందుతున్న హనుమాన్ సినిమా సంగీత దర్శకుడు క్రొవ్విడి గౌర హరి తణుకు వాసి కావడం మనకు గర్వకారణమని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు మంత్రి క్యాంపు కార్యాలయంలో గురువారం ఆల్ ఇండియా బ్రాహ్మణ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి కారుమూరిని కలిసిన సందర్భంగా గౌర హరిని వేదపండితుల సమక్షంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ సంక్రాంతి పండుగకు రిలీజ్ అయిన హనుమాన్ సినిమా తెలుగు సినీ ప్రేమికుల హృదయాలను కదిలించిందని అటువంటి మహా చిత్రానికి సంగీత దర్శకుడిగా ఉన్న హరిని ప్రతి ఒక్కరూ అభినందించాల్సిందేనని స్పష్టం చేశారు. మన కుటుంబసభ్యుడు అటువంటి మహోత్తర సినిమాలో భాగస్వామ్యం కావడం శుభపరిణామమన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని మంచి సినిమాల్లో మంచి అవకాశాలు రావాలని ఆకాంక్షించారు. ఆల్ ఇండియా బ్రాహ్మణ ఫెడరేషన్ ఉపాధ్యక్షులు సూరంపూడి కామేష్, తణుకు నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షుడు పొట్ల సురేష్, ఇంపల్స్ జూనియర్ కళాశాల అధినేత రామ్‌కుమార్ పాల్గొన్నారు.

యువతకు అన్నింటా అవకాశాలు

రాష్ట్ర మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు



తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

తణుకుటౌన్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం యువతకు అన్ని రంగాల్లో అవకాశాలు కల్పించి, వారి భవితకు బాటలు వేసిందని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. గురువారం తణుకు ఎస్సీఐఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్రనైపుణ్యాభివృద్ధి సంస్థ, జవహర్ నాలెడ్జి సెంటర్ (జేకేసీ) సంయుక్తంగా నిర్వహించిన మెగా జాబ్ మేళాను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ రాష్ట్రంలోని పేద పిల్లలందరూ ఇంగ్లీష్ మీడియంలో చదవాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆసెంబ్లీలో బిల్లు ఆమోదిస్తే శాసన మండలిలో బలం ఉన్న టీడీపీ నాయకులు దానిని అడ్డుకున్నారని చెప్పారు. ఇంగ్లీష్ మీడియం చదువుల కారణంగా ప్రపంచ వ్యాప్తంగా కేరళ రాష్ట్ర ప్రజలు ఉపాధి అవకాశాలు పొందుతున్నారని చెప్పారు. రాష్ట్రంలో అభివృద్ధి జరగలేదని విమర్శిస్తున్న ప్రతిపక్షాలకు రాష్ట్రంలో ఈ నాలుగున్నరేళ్లలో జరిగిన అభివృద్ధి గణాంకాలను తెలుసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని నీతి అయోగ్ రికార్డుల ప్రకారం మన రాష్ట్రంలో వ్యవసాయ వృద్ధి రేటు టీడీపీ హయాంలో 3.5 శాతం ఉండగా, నేడు 11.7 శాతంగా ఉందన్నారు. పారిశ్రామిక అభివృద్ధి గతంలో 3. 7 శాతంగా ఉండగా నేడు 11.5 శాతానికి పెరిగిందన్నారు. చదువులో టీడీపీ హయాంలో మన రాష్ట్రం 15వ స్థానంలో ఉండగా నేడు దేశంలో నెంబరు 1 స్థానంలో నిలిచామన్నారు. గత టీడీపీ హయాంలో తణుకు నియోకవర్గంలో మొత్తం రూ. 680 కోట్లు ఖర్చు చేయగా నేడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ. 3, 300 కోట్లు అభివృద్ధి పనులు జరిగినట్లు చెప్పారు. ఈ సందర్భంగా రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికేట్‌లను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆర్‌జేడీ డాక్టర్ సీహెచ్ కృష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీ అనిల్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్ ఏడుకొండలు, జేకేసీ చీఫ్ ఏ రామ్‌గోపాల్, నిడదవోలు కళాశాల ప్రిన్సిపాల్ రుద్ర, మాజీ ఏఎంసీ చైర్మన్ చిట్టూరి సుబ్బారావు, కళాశాల సీపీడీసీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, తణుకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సూరంపూడి కామేష్, వైఎస్సార్‌సీ నాయకుడు పీ సురేష్, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సిబ్బంది, వివిధ కళాశాలల జేకేసీ కోఆర్డినేటర్లు, అధ్యాపక సిబ్బంది, వివిధ కళాశాలల విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

మసీదు ప్రారంభోత్సవం

అత్తిలి: మండలంలోని పునఃనిర్మించిన మసీదును గురువారం ముస్లిం మత పెద్దలు ప్రారంభించారు. ముస్లిం సాంప్రదాయ ప్రకారం నర్సాపురంకు చెందిన మత పెద్దలు ముఫ్తీ రిజవాన్, షేక్ అఫ్రోజ్, షేక్ అర్షద్, షేక్ అబ్దుల్లా, షేక్ సాధిక్ ఆధ్వర్యంలో ఇస్లాం సాంప్రదాయ పద్ధతిలో నమాజ్, ఖురాన్ పఠనం, ధార్మిక ప్రసంగాలు చేశారు. రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబులు మసీదు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా మతపెద్దలు ప్రత్యేక ప్రార్థనలు జరిపి, మసీదు తరపున ఇరువుర్ని ఘనంగా సత్కరించారు. మసీదు నిర్మాణ కమిటీ అధ్యక్షుడు, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, మసీదు కమిటీ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ మొహిద్దీన్‌ఖాన్, ఉపాధ్యక్షుడు సత్తార్, ముతపల్లి షేక్ హస్సనాయర్, కార్యదర్శి షేక్ ఖాజావల్లి, ఎండీ అలీ, షేక్‌ఫరీఫ్‌వల్లి, అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, ఎంపీపీ మక్కా సూర్యనారాయణ,అత్తిలి, కూనపరెడ్డి జయ రాజు, చిట్టూరి వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.

2న బేసిక్, మీనవిల్లూరు స్కూల్‌లో వ్యక్తిత్వ వికాస శిక్షణ

పెంటపాడు: ఈనెల 2న ఉదయం పెంటపాడు ప్రభుత్వ పోస్టుబేసిక్ పాఠశాలలో, మధ్యాహ్నం మీనవిల్లూరు జెడ్పీ హైస్కూల్లో పదో తరగతి విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు మండల మానవత సంస్థ అధ్యక్షుడు నల్లమిల్లి ప్రభాకరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మానవత ఉమ్మడి జిల్లా అధ్యక్షులు తాడేపల్లి మోహనరావు ముఖ్య అతిథిగా పాల్గొని వికాస శిక్షణ తరగతులు నిర్వహిస్తారన్నారు. ఎంఈవో టీవీ రామకృష్ణ, ఆయా పాఠశాలల హెచ్ఎంల ఆధ్వర్యంలో జరిగే ఈ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, మండల మానవత సభ్యులు విధిగా హాజరు కావాలని కోరారు.

రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

భీమవరం: రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పని చేస్తుందని ప్రభుత్వ విప్, భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. వైఎస్సార్‌సీపీ భీమవరం పట్టణ నూతన కమిటీ సభ్యులు గురువారం క్యాంపు కార్యాలయంలో శ్రీనివాస్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రంధి మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిరంతరం ప్రజాసేవలోనే ఉందని అందువల్లనే భీమవరం నియోజకవర్గాన్ని రాష్ట్రస్థాయిలో ఆదర్శవంతంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా బలోపేతం కావాలనే సంకల్పంతో నవరత్న పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. రాబోయే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలన్నారు.

మంత్రి కారుమూరికి అభినందనలు



మంత్రి కారుమూరి నాగేశ్వరరావును కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న దృశ్యం

తణుకు టౌన్: మండలం కోనాల గ్రామంలోని ఎస్సీ ఏరియాలో గత ఐదు సంవత్సరాలుగా ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్ల సమస్యను పరిష్కరించాలని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు దృష్టికి తీసుకురాగానే సంబందిత విద్యుత్ శాఖా అధికారులు సమస్యను పరష్కరించడం పట్ల కోనాల గ్రామానికి చెందిన ఎస్సీ కాలనీ పెద్దలు మంత్రి కారుమూరిని కలసి అభినందనలు తెలిపారు. గురువారం తణుకులోని మంత్రి కారుమూరి నివాసానికి చేరుకుని మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనంద్‌కుమార్, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీ సురేష్, గెద్దం బాపూజీ, గాలికి శ్రీనివాస్, వెలుచూరి ఏసు, చదలవాడ లోకయ్య పాల్గొన్నారు.

అధ్వానంగా హైవే నిర్వహణ

- ఫ్లై ఓవర్ నిర్మాణ ప్రాంతంలో ప్రమాదాలు
- నిత్యం మరమ్మతుల పేరుతో ట్రాఫిక్ మళ్లింపు
- మృత్యువాత పడుతున్న వాహనదారులు
- చర్యలు తీసుకోవాలని వాహనదారుల విజ్ఞప్తి



ఉండ్రాజవరం జంక్షన్ జాతీయ రహదారిపై జరుగుతున్న నిర్మాణ పనులు

తణుకు: జాతీయ రహదారిపై చేపట్టిన ఫ్లైవోవర్ నిర్మాణాలు... మరోవైపు జాతీయ రహదారి నిర్వ హణ పనులు... వెరసి వాహనదారుల ప్రాణాల మీదకు తెస్తున్నాయి. నిర్మాణం, నిర్వహణ పేరుతో సిబ్బంది అవలంభిస్తున్న తీరుతో పలువురు ప్రాణాలు కోల్పోతున్నారు. తణుకు పట్టణ పరిధిలోని జాతీయ రహదారి అభివృద్ధి పనుల పేరుతో ఇటీవల మరమ్మతులు చేపట్టారు. అయితే గత కొన్నేళ్లుగా మరమ్మతుల పేరుతో నిత్యం ట్రాఫిక్ మళ్లి స్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. తద్వారా పలువురు వాహనదారులు మృత్యువాత పడుతుండగా పదుల సంఖ్యలో వాహనదారులు గాయాల పాలవుతున్నారు. మరోవైపు జాతీయ రహదారి నిర్వహణ పనులకు వినియోగిస్తున్న భారీ వాహనాలు ప్రమాదాలకు కారణమవుతున్నా యి. గతంలో తణుకు మండలం దువ్వ జాతీయరహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో హైవే నిర్వహణ వాటర్ ట్యాంకర్ వాహనం ఢీకొని పదో తరగతి చదువుతున్న బాలిక దుర్మరణం పాలైంది. పాత టోల్‌గేట్ సమీపంలో రోడ్డు నిర్వహణకు వినియోగిస్తున్న లారీను టిప్పర్ ఢీ కొన్న ఘటనలో డ్రైవర్ మృత్యువాత చెందాడు. ఉండ్రాజవరం జంక్షన్ వద్ద ఫ్లైవోవర్ నిర్మాణ ప్రాంతంలో సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా పలువరు ఇటీవల మృతి చెందారు.

నిత్యం ట్రాఫిక్ మళ్లింపు...

పెనుగొండ మండలం సిద్ధాంతం నుంచి తాడేపల్లిగూడెం వరకు దాదాపు 50కిలోమీటర్ల మేర జాతీ య రహదారి విస్తరించి ఉంది. జాతీయ రహదారి నిర్వహణ, మరమ్మతులు చేపట్టేందుకు దాదాపు రెండేళ్ల క్రితం ఒక కాంట్రాక్టు సంస్థకు అప్పగించారు. ఇందులో భాగంగా ఈ రోడ్డులో నిత్యం మరమ్మతులు చేస్తుండటంతో ట్రాఫిక్ మళ్లింపు చేపడుతున్నారు. దీంతో రోడ్డుకు మధ్య భాగంలో ట్రాఫిక్ కోన్స్ ఏర్పాటుచేస్తున్నారు. కిలోమీటర్ల మేర వీటి ని ఏర్పాటు చేస్తుండటంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటీవల దువ్వలో జరిగిన ప్రమాదంలో రోడ్డు డివైడర్‌లో మొక్కలకు నీళ్లు పోసే వాటర్‌ట్యాంకర్ వాహనం మోటారు సైకిల్ ను ఢీకొట్టడంతో బాలిక అక్కడిక్కడే దుర్మరణం పాలైంది. గతంలో డీమార్ట్ సమీపంలో సైతం మోటారు సైకిల్‌పై వెళుతున్న మహిళ రోడ్డు డివైడర్‌పై పడి మృతి చెందారు. పెరవలి మండలానికి చెందిన మరో వ్యక్తిని హైవే నిర్వహణ వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఉండ్రాజవరం జంక్షన్‌వద్ద సిగ్నల్‌వద్ద వేచి ఉన్న యువకుల మోటారు సైకిల్‌ను వెనుక నుంచి వాహనం ఢీకొట్టిన ఘటనలో ఒక యువకుడు మృతి చెందాడు. ఇటీవల అలంపురం సెంటర్ వద్ద ట్రాఫిక్ మళ్లింపులో భాగంగా రోడ్డు దాటుతున్న మహిళను లారీ ఢీకొట్టింది. ఈప్రమాదంలో తణుకు పట్టణానికి చెందిన మహిళ మృతి చెందగా ఆమె కుమార్తెకు తీవ్ర గాయాలయ్యాయి. దువ్వ జాతీయ రహదారిపై డివైడర్ మధ్యలో గొయ్యిలో పడి ఒక యువకు డు మృతి చెందాడు. ఉండ్రాజవరం జంక్షన్ వద్ద డివైడర్ కోసం ఏర్పాటు చేసిన బోర్డును ఢీకొని వ్యక్తి మృతిచెందగా అదే ప్రాంతంలో తీసిన గొయ్యి గమనించకపోవడంతో యువకుడు మృత్యువాత పాలయ్యాడు.

నాసిరకం పనులతో నిర్మాణాలు

జాతీయ రహదారి నిర్మాణ పనులు నాసిరకంగా చేపట్టడంతో నిత్యం మరమ్మతులకు గురవుతున్నాయి. దీంతో ఈ మార్గంలో నిత్యం రోడ్డు మరమ్మతులు చేస్తున్నారు. మరోవైపు పగలు సమయాల్లో మాత్రమే మరమ్మతు పనులు చేపడుతూ రోడ్డు మళ్లింపు చేపట్టాల్సిఉంది. అయితే జాతీయ రహదారి నిర్వహణ సిబ్బంది మాత్రం రాత్రి సమయాల్లో సైతం ట్రాఫిక్ కోన్స్ అలాగే వదిలేయడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఒక్కోసారి మరమ్మతు పనులు చేయకపోయినప్పటికీ రోడ్డుమార్గం మళ్లిస్తుండటంతో సుదూర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా జాతీయ రహదారి నిర్వహణ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు.